# రేపు రాని కలలు

ఇరవై నిమిషాలనుంచి ప్రకాశరావు సరోజినిని గురించి చెప్తున్నాడు. పాతిక ఇప్పుడే నిండిన వయసులో, కొత్తగా మంచి ఉద్యోగం దొరికిన ఆనందంలో, చిరకాలంనించి పెరుగుతోన్న స్నేహితుడిగా నాదగ్గిర ఉన్న చనువులో, ఈఅమ్మాయి అనుకోకుండా అతన్ని జీవితాంతం భాగస్వామిగా స్వీకరించిన విషయం అతను విపులంగా నాతో చెప్పడంలో ఆశ్చర్యం ఏం లేదు.

"ప్రతీ చిన్న విషయానికీ నొచ్చుకుంటుంది—ఎంతో సెన్సిటివ్ గర్ల్...కిందటివారం ఆమె బర్త్‌డే పార్టీకి పన్నెండు నిమిషాలు ఆలస్యంగా వెడితే, ఆమెకి కన్నీళ్ళు పర్యంతం ఐంది..."

ఎవరికీ చెప్పుకోలేని నా జీవితంతోని కొన్ని సంఘటనల్లోని రహస్యాలు అతనికి తెలీకపోవడంకూడా ఆశ్చర్యంలేదు. దెబ్బలుతిన్న మనస్సుకి తన సంభాషణ ఎలాంటి జ్ఞాపకాలు తెస్తున్నాయో, ప్రణయంలో అనుభవం లేకుండానే సఫలత పొందిన ఆనందంలో ప్రకాశరావు ఏమిటి గమనించగలడు? అతనికీ, నాకూ వయస్సులో వ్యత్యాసం తక్కువే అయినా, అనుభవాల్లో ఎంతో తేడా ఉంది. బాధ పడిపడి, హృదయంలో ఉన్న మార్దవం ముత్యాలలాగ గట్టిపడి ఆ బాధ ఇంక తెలియకుండా అయిపోయింది నాకు. వేడితగలకుండా, వెచ్చవెచ్చ

గానే, సుఖంగా, ఆనందంగా గమ్యస్థానం చేరుకున్న సంతోషంలో మరీ మార్దవం అయిపోయింది అతని మనస్సు.

"...సిగరెట్లు కాలిస్తే టి.బి.యో, కాన్సరో వొస్తుందని మహా భయం పిచ్చిపిల్లకి...దేనికీ కన్నీరుపెట్టని సరోజిని ఆ ఒక్కవిషయంలోనూ మాత్రం ఆతృత దాచుకోలేకపోయింది".

బ్రదర్! ఇది అపురూపంకాదు; సృష్టి ప్రారంభించాక నీ విషయంలోమాత్రమే తల ఎత్తుతూన్న విచిత్రం కాదిది... పాదదాసిగా కలల్లో కనిపించి, భాగస్వామిగా దగ్గరికి వొచ్చి, భార్యగా జీవితంలో ప్రవేశించి యజమానిగా నిన్ను సుఖపెట్టే శిల్పంలో ఇది గతితప్పని సూత్రం అని ఎలాగ చెప్పేది?

"అందుకే సినీమాలు చూడ్డం మానేశావా?" అన్నాను దాచుకోలేని చిరునవ్వుతో. వారానికి మూడు సినీమాలు చూసే ప్రకాశరావు ఈమధ్య బ్రతిమాలినా సినీమాలకి రావడంలేదు-ముఖ్యంగా అమెరికన్ సినిమాలైతే.

"నువ్వెంత చెప్పు, జగన్! అసలు సినీమాలే మరీ అసహ్యం ఐపోయాయి-అందులో ఇంగ్లీషువి మరీని...కళ్ళతో పాటు మనస్సునీ పాడుచేసేస్తాయి."

"ఆ మాట సరోజిని చెప్పిందా?"

"ఛా! ఆ అమ్మాయి అలాటిదికాదు-నువ్వు..."

ప్రకాశరావు ఆగిపోయాడు కొంచెం సందేహంతో.

"చెప్పు బ్రదర్!-నేను-!" అన్నాను సానునయంగా - నా చిరునవ్వు నేను ఎదురుచూస్తోన్నమాట నాలో కలిగించిన భావాలని దాచగలదనే విశ్వాసంతో,

"నువ్వు-సినిక్‌వి" అన్నాడు ప్రకాశరావు.

అబద్ధం కోపం తెప్పిస్తుంది.

నిజం-ఇలాటిది-బాధకలిగిస్తుంది.

నా చిరునవ్వుని పెద్దదిచేసి రెండూ దాచుకున్నాను. అతనన్నది నిజం-కాని, అతనే నమ్మడు.

నాతో అతనూ నవ్వేడు.

"సరోజినికి ఆరకం సినిమాలు అంటే విపరీతమైన అసహ్యం" అన్నాడు మళ్ళీ తనలోకాల చల్లదనాల్లోకి జారుకుంటూ, ప్రకాశరావు.

"ఇప్పుడు నీకూ సినిమాలంటే-"

"విపరీతమైన అసహ్యంలేదు బ్రదర్! కాని, ఆమెదీ నాదీ ఆ విషయంలో అభిరుచి ఒక్కటే..."

"గుడ్!" అన్నాను.

"నువ్వెన్ని చెప్పు-భార్యాభర్తలుగా జీవించదలుచుకున్న వాళ్ళకి అభిరుచులు ఒకటిగా ఉండాలి. ఏం?" అన్నాడు ఆశగా, ప్రకాశరావు.

నీరసంగా, "అవును-నా మాటలు లక్ష్యపెట్టకు. అవన్నీ హాస్యంగా అన్నవి" అన్నాను. ఆ విషయం చర్చించాలనికాదు. కారణం ఎప్పుడో జరిగిన ఒక విషయం జ్ఞాపకం చేసుకోవటం నాకు మరీ ఇష్టంలేదు. కోపం, పిరికితనం కలిసిన ఒక ప్రవర్తనలో జరిగిన ఆ ఉదంతం మరిచిపోయే ప్రయత్నం ఎంతో చేశాను.

ప్రకాశరావు మరేదైనా విషయం గురించి మాట్లాడితే బాగుండును...

కాని అతను హఠాత్తుగా వాచీ చూసుకుని, కుర్చీలోంచి ఒక్కసారి లేచి, "టైమయింది బ్రదర్! పోస్టాఫీసుకి వెళ్ళి వస్తాను. సరోజిని ఉత్తరం రావాలి," అంటూ త్వరత్వరగా వెళ్ళిపోయేడు.

అప్పుడే వొచ్చిన ఇలస్ట్రేటెడ్ వీక్లీ కాగితాలు తిర గెయ్యడం మొదలుపెట్టేను - ప్రకాశరావుని గురించి జాలి పడాలో, అసూయపడాలో నిర్ధారణ చేసుకోలేక.

నూతన వధూవరుల చిత్రాల్లో హఠాత్తుగా కనిపించింది ఆమె చిత్రం...హృదయం ఒక్కసారి ఆగినంత పనిచేసింది ఆశ్చర్యంతో. కిందని పేరు చదివేను. అవును-ఆమె నిజంగా రాధ...

*　　*　　*

రెండేళ్ళయింది నేను రాధని కలుసుకుని. అప్పటికి కలకత్తా వచ్చి మూడేళ్ళైపోయింది. ఆ మహానగరంలో కాలం ఎంతో చక్కగా గడిచిపోతూన్నా, దక్షిణదేశం రావాలని అని పించడం ప్రారంభించింది.

ఆ రోజుల్లో తరుచు మాయ నా ఇంటికి వొస్తూఉండేది ఆమె వచ్చినప్పుడల్లా రసగుల్లా, పెసరట్ కావాలనేది. రస గుల్లామీద ప్రభుత్వం యుద్ధం ప్రకటించడాన్ని రిజెంట్ పార్క్ దగ్గరికి వెడితేకాని అవి దొరికేవికాదు. కాని, అంతదూరం

డ్రైవ్ చెయ్యడం ఆమెకోసం పెద్దకష్టంగా అనిపించేదికాదు. స్నేహితురాలిగా, ఆప్యాయతతో అంతగా ముంచేది మాయ.

ఒకరోజు-నాకు ఆ రోజు ఇప్పటికీ నిన్నలాగ ఉంటుంది-బాగా వర్షం పడింది. నేను ఆఫీసునించి ఇంటికి వెళ్ళే ప్రయత్నంలో లేవబోతోంటే మాయ టెలిఫోన్ చేసింది-ఆ సాయంత్రం వొస్తున్నానని చెప్పడానికి.

ఆఫీస్‌నించి ఇంటికి వెళ్ళకుండానే తిన్నగా రిజెంట్ పార్కుకి వెళ్ళేను. ఉదయం బాగా వర్షం కురిసిఉండేమో, చాలాచోట్ల వర్షపునీరు కొంచెం కొంచెం ఇంకా రోడ్లమీదా, ట్రామ్ లైన్లమీదా కనిపిస్తూనే ఉంది.

నేను మాధురి-అది ఆ స్వీట్‌షాప్ పేరు-చేరుకునేసరికి ఆరుదగ్గర కావొచ్చింది. వర్షం మూలాన కాబోలు, అక్కడ ఆట్టేమంది లేరు.

"రసగోలా కావాలి" అన్నాను.

దుకాణదారు కొంచెం సందేహంగా, "ఎన్నో లేవు-ఈ రోజు వర్షంమూలాన సరుకులురాక వస్తువులు తయారు కాలేదు. మీ కెన్ని కావాలి?" అన్నాడు.

"కనీసం ఒకడజను..."

"అతను ఒకకుండలో వెతికి, "పదే ఉన్నాయి..." అన్నాడు.

"సరే" నన్నాను.

కుల్లడిలోవేసి మీదని ఆకుతో కట్టి నాకిచ్చేడు దుకాణదారు. నేను డబ్బు తీసేలోపున రాధ వొచ్చింది లోపలికి.

అందంగా, ఆర్ద్రంగా మాధుర్యం విరజిల్లుతూ హృదయాలని కట్టిపడేసే కళ్ళు ఎన్నోవొందలు చూశాక కొంత స్థిరపడ్డాను - అప్పటిదాకా అలాగ అనుకున్నాను. రాధని చూస్తూనే మనస్సు విపరీతంగా చలించిపోయింది-అవయవాలలో చలనమేలేకుండా పోయింది. ఆమెది కేవలం సౌందర్యం కాదు. సర్వాంగాలనీ అతిక్రమించి చల్లగా, వెచ్చగా, అతి సున్నితంగా, మహాబలంతో అదృశ్యంగానే మనిషిని లొంగదీసుకునే శక్తి అది.

ఆమె రసగోలాలు కొనడానికి వొచ్చింది. తియ్యటి ఆ కంఠస్వరం ఆమె పరిపూర్ణతకే మెరుగులు పెడుతూంది.

సరుకులేదని విని, చాలా బాధపడ్డాను. ఈ విలాసినికి లేదని చెప్పే నీచత్వం వాడిలో ఎలా రాగలిగింది? కాని, నిస్సందేహంగా మాటలతో, చేతుల్తో, దుకాణదారు ఆ విషయమే చెప్తున్నాడు.

క్షణమాత్రం ఆమెలో లీనం అయిపోయిన నేను మళ్ళీ ఎదురుగా జరుగుతున్న వాస్తవంతో మళ్ళీ ప్రపంచంలోకి వొచ్చాను. డబ్బు ఇస్తూ నా పేకెట్ తీసుకోబోయాను.

"అమ్మ జన్మదినం ఇవేళ. రసగోలా లేకుండా ఎలాగ?"

ఎవర్నీ ఉద్దేశించకుండా సున్నితంగా వాపోయింది ఆమె.

హఠాత్తుగా బయట వర్షం ప్రారంభించింది.

"ఐదారైనా లేవా ?"

నీరసంగా మళ్ళీ అడుగుతోంది.

"లేవు. ఉన్నవి ఆయన కిచ్చేశాను" అంటున్నాడు దుకాణదారు. నా చిల్లర లెక్క పెడుతూ.

"నే నెప్పుడూ ఇక్కడే అన్నీ కొంటాను..."

"ఆయనా అలాగే!"

దుకాణంలోకి వర్షపుజల్లు వొస్తూంటే కిటికీ మూసి, గదిలో రెండోదీపం వెలిగించాడు అతను.

"ఏం చేసేది ?..."

ఆమె దుకాణపు గాజుపెట్టెల్లో ఉన్న కొద్ది మిఠాయిల వొంక అనిష్టంగా చూసింది. సందేష్ కూడా లేదు ఎక్కడా. రసగోలాతోబాటు సందేష్ కూడా శత్రువర్గంలో చేర్చబడింది.

నిస్పృహగా ఆమె బయటికి నడవబోయింది. "అరే ! మళ్ళీ వర్షం పడుతోంది. బస్ కూడా దొరకదు" అంది.

ఎంత ప్రయత్నించినా నేను ఊరుకోలేకపోయాను. ఇంత చిన్న కాలంలో ఇన్ని బాధలు పడే అర్హత ఆమెకిలేదు.

"నా కారు ఉంది. ఎక్కడికి వెళ్లాలి మీరు?" అన్నాను.

"భవానీపూర్...కాని, మీకు శ్రమ ఇవ్వాలిలేదు." అంది ఆమె.

"శ్రమ ఏంలేదు. పదండి" అన్నాను.

"మీ రెక్కడికి వెళ్ళాలి?"

"బాలీగంజ్..."

ఏదో అనబోయి ఆమె ఆగిపోయి, నా వెనకాలే వొచ్చింది. నేను కారు తలుపులు తీసేలోగా కొంచెం తడిసేను.

ఆమెకూడా కొంచెం తడిసింది- వర్షం చాలా ఉధృతంగా వుంది.

అప్పుడే రోడ్డుమీద బాగా నీరు నిలిచిపోయింది. నెమ్మదిగా కారు వెనక్కి తిప్పి రోడ్డు పట్టేను.

"మీ పేరేమిటి?" అంది హఠాత్తుగా ఆమె. నా ఆలోచనలు ముందరి రోడ్ మీద ఉన్నాయి.

చెప్పేను.

"నా పేరు రాధ" అంది.

"చక్కటి పేరు" అన్నాను.

రాధ నవ్వింది.

"మీ రలాగ అంటారని అనుకున్నాను!" అంది.

ఆమె సాన్నిహిత్యం వెన్నెలివర్షంలాగ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఇంద్రియాలు వేటికవి ఉద్రేకంగా నన్ను బాధిస్తున్నాయి. బయట వర్షం-డ్రైవింగ్ కష్టంగా ఉంది. రోడ్డుమీద బస్సులూ, ట్రాములూ నడవకపోయినా.

విండ్ షీల్డ్ మీద నీళ్లు అనంతంగా నదుల్లాగ ప్రవహిస్తున్నాయి. వైపర్స్ శక్తికొద్దీ శుభ్రంచేసినా, లోపల గాలి లేక అద్దంనిండా తెల్లటి పూత మాటిమాటికీ శుభ్రం చెయ్యాల్సి వొస్తోంది.

"ఆ పని నేను చేస్తాను" అంది రాధ.

రుమాలు ఇచ్చేను.

భవానీపూర్ చేరేసరికి నలభై నిమిషాలు పట్టింది. ఆమె ఇల్లు చూపింది. కారు ఆగగానే, "ధన్యవాదాలు-మీరు సహాయం చెయ్యకపోతే ఏమౌనో!" అంది.

ఆమె దిగి వెళ్ళిపోతుందనే విషయం ఒక్కసారి నన్ను కృంగదీసింది. ఈ నలభై అయిదు నిమిషాల్లో ఆమె ఎంతో పాత స్నేహితురాలై పోయింది.

ఆమె దిగబోతుంటే చెయ్యిపట్టుకుని ఆపేను. ఆమె చెయ్యి విడిపించుకోకుండా కొంచెం ఆశ్చర్యంగా "ఏమిటి ?" అంది.

"రసగోలా-మీరు పట్టుకెళ్ళండి."

"మీకు ?"

"అంత అవసరం లేదు..."

"మీకు స్వీట్స్ అంత ఇష్టంకాదా ?

"చాలాచాలా ఇష్టం...కాని మీరు అవి తీసుకుంటే ఇంకా తియ్యగా ఉంటుంది."

నవ్వి, బాగా మాట్లాడతారు మీరు!" అంది రాధ.

ఆ కాంప్లిమెంట్ ఎంత సంతోషం తెచ్చిందో ఇప్పటికీ మరచిపోను నేను.

"అవి తీసుకోండి," అన్నాను.

"థేంక్స్..." అని పర్సు తీసుకోడానికి చెయ్యి వొదిలించుకోబోయింది.

"అదేం వీల్లేదు- మీ అమ్మగారి జన్మదినానికి నా శుభా కాంక్షలతో..."

ఏదో అర్థం అయినట్లు చూసి, "మరయితే...ఒక్క షరతు" అంది రాధ.

"ఏమిటి?" అన్నాను ఆమె చెయ్యి ఎంతో మెత్తగా, వెచ్చగా ఉంది

"లోపలికి ఒచ్చి టీ తాగండి."

అలాగ పరిచయం అయింది రాధ. ఆమె రిజెంట్ పార్క్ దగ్గర ఏదో ఆఫీసులో పని చేస్తూవుండేది. రెండు మూడు నెలలు ప్రతిరోజూ ఆమెని కలుసుకుంటూ వుండేవాణ్ణి అప్పుడు జీవితం అంతా ఆమెకోసం ఎదురుచూడ్డం. రోజంతా సాయంత్రకోసం కలలు.

ఆమె కేవలం దైహికంగానే నన్నాకర్షించిందేమోనని నాకు సందేహం ముందర వచ్చినమాట నిజమే. కాని, ఆత్మ పరీక్ష చేసుకున్నాక ఆమె వ్యక్తిత్వం, ఆమెలోని అనేక విష యాలు నన్నాకర్షించాయని గ్రహించగలిగాను. ఆమెతో నా స్నేహం ఒక సాయంత్రపు వెన్నెలవర్షంకాదు. ఆమె నాకు గృహిణి కావాలి. ఆమె పరిపూర్ణత నాకూ శాశ్వతంగా, దగ్గ రగా కావాలి, ఆమె నాకు కావాలి.

ఆ నిర్ణయానికి త్వరలోనే వొచ్చేను కాని. తొందరలో పనులుచేసే స్వభావం కాదునాది. సృష్టిలో నిజంగా పూర్ణత్వం చెందిన మానవుడు లేడని నా నమ్మకం. ఆమె అంతా కాంతి లాగ నా కళ్ళకి కనిపించినా, ఆ కాంతికి అవతల దాచుకున్న

చీకట్లనీ చూసి మరీ నిర్ణయించుకోవాలని నా నమ్మకం. హఠాత్తుగా ఇలాటి మచ్చలు చూడడంకన్న వాటి ఉనికిని అంగీకరించడం మంచిదని నా నిర్ణయం.

అందుకే ప్రచండంగా నన్ను ముంచెత్తుతోన్న ఈ వ్యామోహపు కెరటాల్లో మునిగిపోకుండా జాగ్రత్త తీసుకున్నాను. హఠాత్తుగా నన్ను జయించడానికి రాధ ప్రయత్నించిందని కాదు. ఆమె సాన్నిధ్యమే అలాటి ప్రభావం కలది.

ముందర రాధ నా సిగరెట్సమీద దాడితీసింది.

"మగవాళ్లెందుకు సిగరెట్ కాలుస్తారో అర్థంకాదు" అంది.

"తప్పేమిటి ?" అన్నాను.

"వాసన-అశుచి" అంది రాధ.

నాకు కోసం వచ్చేలోపున రాధ నా కళ్ళల్లోకి చూసి లోపలి కోపాన్ని చల్లగా హరించేసింది. "నీ ఆరోగ్యంపాడైతే నాకు బ్రతుకెలాగ ? నాకోసం మానెయ్యవూ ?" అంది.

ఆమెని కాదనే శక్తి ఎక్కడిది ?

నేను ఓడిపోయాననే చిన్నతనాన్ని నామంచి దాచింది రాధ. కాని, ఆమెలో ఒకటయినా చీకటి కేర చూడగలగడం నాకు సంతృప్తిని ఇచ్చింది. ఆమె మానవులకి మరీ దూరంగా లేదు.

ఒక సాయంత్రం లేక్సకి వెళ్ళేం. షికారుగా నడుస్తూంటే "ఆదివారం డైమండ్ హార్బరుకి వెడదాం" అంది రాధ.

"సారీ-ఆరోజు బ్రిడ్జి ఆడడానికి మాట ఇచ్చేను," అన్నాను.

చిన్నబుచ్చుకుని, "పేకాట అంత మంచి అలవాటు కాదు" అంది రాధ.

నేను అగిపోయాను. ఈమాట నాకేం నచ్చలేదు.

"నేను ఆడేది జూదంకాదు రాధా!" అన్నాను.

"అవును. జూదం అయితే నువ్వు ఆడవు" అంది రాధ.

"నీ కెలాగ తెల్సును ?"

"సిల్లీ! నాకు నిన్ను గురించి తెలుసును. చెడుఅలవాట్లు లేవు నీకు."

"నీ కన్నీ తెలీవు"

నవాలు చేస్తున్నట్టుచూసి, "నాకన్నీ తెలుసును అంది రాధ.

ఈసారి నీడలు బాగా కనిపించాయి. నేను ఓడిపోదలచుకోలేదు. కాని, ఆ క్షణంలోనే మా అత్యంత సాన్నిహిత్యం తగ్గడం ప్రారంభించింది.

మరికొన్ని చిన్నచిన్న విషయాలు క్రమంగా మా యిద్దరిమధ్యా దూరాన్ని ఎక్కువ చేశాయి. అవన్నీ జ్ఞాపకం లేవు.

కాని, మా మధ్య విముఖత తెచ్చిన సంఘటన ప్రతి సెకనూ నా జ్ఞాపకాల్లో నిలిచిపోయింది.

ఆ రోజూ చిన్నవర్షం పడుతూంది.

"మాధురుకి తీసికెళ్లు" అంది రాధ.

వెళ్లేము. ఆమె స్వీట్స్ తింటూంది. నేను సమోసా తింటున్నాను.

"సందేష్ తిను" అంది రాధ.

"వొద్దు నాకు స్వీట్స్ అంత ఇష్టంలేదు" అన్నాను.

బాధగా, కొంచెం కోపంగా, నావొంక చూసి, "నీకు అబద్ధాలాడడం బాగావొచ్చును," అంది.

నే నేం అనలేదు. ఒక్క అబద్ధం మాత్రమే ఆడేనని ఆమెకి చెప్పి ఏం ప్రయోజనం?

"మరి, ఇక్కడ స్వీట్స్ ఎందుకు కొంటావు?"

"ఒక ఫ్రెండ్ కోసం."

"ఎవ రావిడ?"

"మాయ."

"ఎలాగ ఉంటుంది?"

"బాగానే వుంటుంది."

"నీ కెలాగ తెలుసును?"

"ఒక సారి పార్టీ ఏదో జరిగితే అక్కడ పరిచయం అయింది."

"నీ ఇంటికి తరుచువొస్తుందా?"

"బుద్ధి పుట్టినప్పుడల్లా."

"ఆమెకి పెళ్ళి అయిందా?"

"ఆఁ."

ఆశ్చర్యంగా చూశాను.

"ఏమిటి, మరి?" అన్నాను,

"ఆయన ఏమీ అనడా?"

"ఎందుకని?"

"అలాగా పదేపదే నీ ఇంటికి ఒస్తే"

తాగుతున్న టీ టేబిల్‌మీదపెట్టి రాధ ముఖంలోకి పరీక్షగా చూశాను.

"నీ ఆలోచనలు బాగులేవు రాధా!" అన్నాను. లోపల ప్రజ్వరిల్లుతోన్నకోపం జీర నా గొంతుకలోకి వొచ్చి ఉండాలి.

"నీ పనుల్లాగే, జగన్!"

నా కోపాన్ని ఎలాగ ఆపుకున్నానో నా కిప్పటికీ ఆశ్చర్యమే. ఈమెతో నా ప్రణయాన్ని ఆశీర్వదించి, తల్లిలాగ సంతోషపడ్డ మాయ ఒకక్కసారి నన్ను ఎక్కడినించో ఆపి ఉంటుంది!

రెండునిమిషాలు మాట్లాడలేదు నేను. కోపం కొంచెం తగ్గాక లేచి, "పద—పోదాం," అన్నాను. అదే మా చివరి సమాగమం అని నాకు తెలుసును అప్పటికి.

"నువ్వు వెళ్లు"

"ఇంటిదగ్గర వొదలనీ"

"బస్సు ఉంది."

నేను వెళ్ళిపోయాను.

తరవాత ఆ సాయంత్రం ఏం జరిగిందో నాకు జ్ఞాపకం లేదు - రాత్రి ఎప్పుడో మాయ నన్ను అన్నంతినమని బల వంతం చేయడంతప్ప.

ఆ తరవాత మూడునెల్లు రాధని చూడలేదు. చాలా సార్లు ఆమె టెలిఫోన్ చేస్తుందనే ఆశతో ఫోన్ పక్క ఎదురు చూసేవాణ్ణి. కాని ఆమె జాడలేదు. ఆమెమీద ఎంతకోపం ఉన్నా, అది ద్వేషంగా ఎప్పుడూ మారలేదు. తాత్కాలికంగా నైనా నా హృదయంతో హృదయం కలిపి స్పందించిన రాధ నా మనస్సుని ఎప్పుడూ వొదిలిపోలేదు. కాని అజేయంగా ఆమె నన్ను తనదగ్గరికి తీసుకోలేకపోయింది.

నాకు కలకత్తానించి ఆ రోజుల్లోనే ట్రాన్స్ఫర్ అయింది. ఒకసోమవారం సాయంత్రం మద్రాస్ మెయిల్‌లో ప్రయాణం. ఆ ఆదివారం చివరిసారిగా ఆ మహానగరంలో అగమ్యంగా తిరగ సాగాను. వెయ్యిలోపాలూ, లక్ష బాధలూ ఉన్నా, ఆ నగరం అంటే నా కెంత అభిమానమో ఆ రోజు తెలిసింది.

సాయంత్రం ఔతోంటే రిజెంట్ పార్క్ వేపు వెళ్ళేను. హఠాత్తుగా మాధురి కనిపించింది. కారు పార్క్ చేసి లోపలికి వెళ్ళే ఆలోచనలోపడ్డాను. ఆ చివరి సాయంత్రం తరవాత మళ్ళీ ఆ పరిసరాలకైనా రాలేదు నేను. కాని ఈరోజు ఆ చోటునించీ సెలవు తీసుకోవాలి...లోపల లోపల నొప్పిలాగ ఏదో బాధ. అడుగు వేస్తోంటే ఎంతో ఆవేదన మాధురికి దగ్గిర పడ్డకొద్దీ నాకు రాధ మరీ దగ్గిర పడింది.

లోపలికి వెళ్ళేను. చాలా మంది ఉన్నారు. దుకాణ దారు నన్ను చూసి పలకరిస్తూ, "చాలాకాలం అయింది, రాలేదేం?" అన్నాడు.

నా మాట అతని కేం చెప్పను? ఇక్కడే నా జీవితంలో మధురాతి మధురమైనరోజూ, మరచిపోని దుఃఖం కలిగించిన రోజూ తెచ్చే జ్ఞాపకాలు నన్నక్కడికి రానివ్వ లేదని ఎలాగ చెప్పను?

ఫేమిలేస్ కోసం ఉంచిన ఒక బూత్‌లో నన్ను కూర్చో బెట్టి నా ఆర్డర్ తీసుకున్నాడు. కొంచెం ఆలశ్యం అవుతుంది-తాజాసరుకు తెస్తానని చెప్పి దుకాణదారు వెళ్ళిపోయాడు.

జ్ఞాపకాలన్నీ మేఘాల్లాగ ముసురు కుంటున్నాయి. నా అనుభవాలకి కారణం ఏమిటి?

ఆమె రుచులు వేరు-నా రుచులు వేరు.

అందుకే ఇద్దరం కలుసుకోలేం.

పదినిమిషాల తరవాత తెరతీసి మళ్ళీ దుకాణదారు లోపలికివోస్తూ, దరహాసంతో, "క్షమిస్తారనుకుంటాను. ఆమెకి ఇక్కడే సీటువుంది." అంటూ రాధని ప్రవేశపెట్టేడు.

క్షణికంగా ఆశ్చర్యంతో నిశ్చేష్టుణ్ణయిపోయాను, లేచి నిలబడేలోగా రాధ ఎదురుగా కూర్చుంది.

"హల్లో," అన్నాను.

ఆమె నావొంక ఒకసారిచూసి, తల వొంచుకుంది. "మీరు—నువ్విక్కడికి ఎలాగ వొచ్చావు?" అంది.

"నీలాగే!" అన్నాను.

ఆమె మనః పరిస్థితిచే అర్థంచేసుకుని, జాలిపడ్డాను. ఆమె ఏదో చెప్పబోతోంది. కాని, చెప్పలేకుండా ఉంది. కొంచెం సేపు పోయాక తేరుకుంది.

"నేను - నే నిక్కడికి రోజూ వొస్తున్నాను..."

"నిజంగా?"

"ఆఁ..."

మా ఆర్డర్ల ప్రకారం స్వీట్సూ, సావరీస్, టీ వొచ్చాయి.

ఆమె ఆ చోటుకి రోజూ రావడం గురించి ఆలోచిస్తూ ఎలాగో తినడం, టీ తాగడం ముగించాను అంతకు ముందే ఆమెకూడా ముగించింది.

బిల్లు చెల్లించి బయటికి నడిచాను - రాధ నా పక్కనే, నన్ను తాకకుండా జాగ్రత్తపడుతూ నడుస్తోంది. అనుకోకుండా సంభవించిన ఈ సమాగమం పాతగాయాలని తిరిగి బయటికి తెస్తుందో, కొత్తగా మరో అధ్యాయం తీయిస్తుందో తెలియలేదు - ఆ క్షణాల కలవరం అలాటిది.

కారు తాళంతీసి ఆమెని ఎక్క మన్నాను.

"ఎక్కడికి?" అంది రాధ

భారంగా ఉన్న దుఃఖాన్నో భావో ద్రేకాన్నో ఆమె కష్టంగా దాచుకుంటూన్న సంగతి బోధపడింది. కాని, నే నేం చేసేది? ఆమెకీ నాకూ సరిపడదు. ఆ అందం వెనకాల నాకు కావలసిన ఆత్మసౌందర్యంలేదు. అది ఉంటే ఆమెని భరించలేక

పోయేవాడిని. కానీ- అది లేకపోవడంతో ఆమెని నేను సహించలేకపోయాను.

"ఇంటిదగ్గర వొదుల్తాను."

"వొద్దు - నేను బస్ మీద పోతాను" అంది రాధ.

"నీ ఇష్టం - కాని నీ దగ్గర సెలవు తీసుకోనీ." అన్నాను.

"ఏమి టది?"

"మెడ్రాసు వెళ్ళిపోతున్నాను ట్రాన్స్ఫరై ..."

నీరసంగా కారుకి జేరబడింది రాధ. నా కెంతో జాలి వేసింది. కాని, ఆమె నిలచి దూరమయాక నేను సమీపానికే రాలేని మాధురికి ఆమె ప్రతిదినంవొస్తూ ఉండేదన్న విషయం మరిచి పోయేటంత జాలికాదు మా మనస్తత్వాలలో ఉన్న విపరీత విభేదాలని మరపించేంతకాదు.

"సారీ నన్నింటిదగ్గర విడు"

రాధ కూర్చుంది. కారు ఆమె ఇంటికి చేరేదాకా ఆమె ఏమీ మాటలాడలేదు. దిగబోయేముందు, "ఏ రైల్లోవెడ తావు?" అని అడిగింది.

"మంగళవారం. మెయిల్లో."

"స్టేషన్లో కలుసుకుంటాను" అని, రాధ కారుదిగి త్వరగా లోపలికి వెళ్ళి పోయింది. నేను మాయ దగ్గరకి వెళ్ళి ఆ మిగిలిన సాయంత్రం ఎలాగో గడిపాను.

ఆ తరవాత రాధని చూడ్డంగాని, ఆమె ప్రసక్తి రావడంగాని జరగలేదు. ఇవేళ ప్రకాశరావు, ఈ పత్రికా ఆ జ్ఞాపకాలన్నీ మళ్ళీ తెచ్చేదాకా,

ఇవన్నీ హృదయాన్ని బాధపెట్టినా, రాధ విషయంలో నాకు పశ్చాత్తాపం లేదు. మా లోకాలు వేరు - విడిపోవడం కన్న శ్రేయస్కరం అయినదిలేదు కాని నన్ను సిగ్గుపరిచినది నా పిరికితనంలో ఆమెకి ఆ మరునాడుకాక, మూడోనాడు బయలుదేరుతున్నట్టు చెప్పడమే. ఆ అసత్యం నన్నెంతో కలవర పెట్టింది. రాధ అనవసరంగా స్టేషన్‌కి వచ్చి ఉంటుందనికాదు. నా ప్రవర్తనలో ఆమెముందు నన్ను నేనే కించపరచు కున్నానని, ఆమె నా కన్న ఎంతో హుందాగా ప్రవర్తించిందే అని.

ముల్లులాగ ఆ పిరికి అబద్ధం ఉండీ వుండీ గుచ్చుకుంటూ ఉంటుంది-ఇవేళ లాగ.

*　　　*　　　*

ప్రకాశరావు వొచ్చి "నీకూ ఉత్తరం ఒచ్చింది జగన్" అంటూ ఒక కవరు ఇచ్చేడు. ఇందాకా ఖాళీచేసిన కుర్చీలో కూర్చుని సరోజిని ఉత్తరం అతను చదువుకుంటూంటే నా ఉత్తరం నేను విప్పి, కింద సంతకంచూసి, ఆశ్చర్యపోయాను. రాధ ఉత్తరం రాసింది:

"జగన్:

మనమధ్య ఏమీలేదు - ఒక జ్ఞాపకం తప్ప. అది నీకూ నాకూ చివరి నిశ్వాసాలదాకా ఉంటుంది.

నువ్వు చేసినది మంచిదా, కాదా అన్నదానికి జవాబు లేదు-కాని, నా జీవితం నేను జీవించాలి. అందుకే, గృహిణిగా రేపటినించి మరొకచోటికి వెడుతున్నాను.

ఈ కొత్తజన్మ ఎత్తేముందు ఒక్కమాట నీతో చెప్పాలి. నువ్విక్కడినించి మెడ్రాసు వెళ్ళేరోజున స్టేషన్‌కి వస్తానని వాగ్దానం చేసి పిరికితనంలో రాలేకపోయాను. అందుకు క్షమాపణ కోరుతున్నాను. నీతో నేను చేసిన వాగ్దాన భంగం అదొక్కటే !

ఎన్నో శుభాకాంక్షలు నీకు !

—రాధ."

ఉత్తరం జాగ్రత్తగా మడిచి జేబులో పెట్టుకున్నాను. ఇది నాకు సంతోషం కలిగించాలో, నా అహంకారానికి మరొక దెబ్బకొట్టాలో తెలియలేదు.

"జగన్ ! డికెన్స్ రాసిన పుస్తకం ఏదయినా ఉంటే ఇస్తావా?" అని అడుగుతూ ప్రకాశరావు నన్ను ఆలోచనల్లోంచి ఇవతలకి తెచ్చాడు.

"ఐదారు ఉన్నాయి-" అని "అరే: నీకు డికెన్సా? పెర్రీమాసన్ ఒదిలేశావా?" అన్నాను ఆశ్చర్యంగా.

"సరోజిని లిటరేచర్ స్టూడెంట్ కదా !...ఆమె అభిరుచి కొంత తెలిసి వుంటే మంచిదని నేనే రాశాను ఏం పుస్తకాలు చదవమంటావని... వైవాహిక జీవితంలో ఇద్దరికీ ఇలాటివాటిలో సామరస్యం ఉండాలి ఏం?" అని ముగించాడు భవిష్యత్తులోకి చూస్తూ, ప్రకాశరావు.

"అవును. అది చాలా మంచిది!" అన్నాను గతాన్ని స్మరిస్తూ, అ క్షణంలో అతనిమీద అసూయకలిగింది.

బయట బరువుగా వర్షం పడసాగింది,